AKSHARA TODAY
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
23-6-2026 (Tuesday) MAIN EDITION

## ఒలింపిక్స్ 2036లో పతకాలే లక్ష్యం : మంత్రి శ్రీహరి




**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నగరం నలుమూలల నుంచి ఒలింపిక్ జ్యోతిని తీసుకువచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

## ఢిల్లీ వేదికగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైంది. వివిధ రంగాలలో తమదైన ముద్రవేసి, విశేష సేవలు అందించిన ప్రముఖులను గుర్తించి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. దేశం గర్వించదగ్గ వ్యక్తులందరూ ఈ వేడుకలో పాల్గొని పురస్కారాలను స్వీకరిస్తున్నారు. ఈ సంవత్సరం మొత్తం 65 పద్మ అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేస్తోంది. ఇందులో 2 పద్మ విభూషణ్, 7 పద్మ భూషణ్ , 56 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి.

## రుణమాఫీపై హరీష్‌రావు తప్పుడు ప్రచారం : అద్దంకి



అక్షరటుడే, హైదరాబాద్: రుణమాఫీపై హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలుపై.. సిద్దిపేట, సిరిసిల్లలో చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. సీఎంపై కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కల్వకుంట్ల కుటుంబం కోసం తెలంగాణను నాశనం చేశారని ఆరోపించారు.

## బీఆర్ఎస్‌పై జూపల్లి విమర్శలు




అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్లలో పాలమూరు ప్రాజెక్టులపై రూ.6 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం 2.5 ఏళ్లలో రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.

## రాష్ట్రంలో విస్తరించిన రుతుపవనాలు



అక్షరటుడే, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు తెలంగాణ అంతటా విస్తరించాయి. రుతుపవనాలు చురుకుగా ఉండటం, అల్పపీడన ప్రాంతాలు ఏర్పడటంతో రాబోయే రెండు వారాల్లో ఉత్తర, మధ్య, తూర్పు మరియు పశ్చిమ తెలంగాణ ప్రాంతాల్లో భారీ వర్షా లు కురవనున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గోట్ సేల్‌కు ఫ్లిప్‌కార్ట్ రెడీ..





**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక సేల్ కు సిద్ధమైంది. జులై 4 నుంచి గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం (గోట్) సేల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఫ్లస్ లేదా బ్లాక్ మెంబర్‌కు 24 గంటల ముందే అంటే జులై 3నుంచే సేల్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. గోట్ సేల్‌లో భాగంగా వివిధ రకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులతోపాటు పలు వస్తువులపై భారీ డిస్కౌంట్‌లు అందించనుంది. ఐఫోన్ 17, శాంసంగ్, మోటొరోలా ఎడ్జ్ 70 ఫ్యూజన్‌పై భారీగా ఆఫర్లు అందించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో చేసే కొనుగోళ్లపై 10 శాతం వరకు డిస్కౌంట్ వర్తించనుంది.

## స్పేస్ ఎక్స్' షేర్లలో భారీ పతనం

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** స్పేస్ ఎక్స్ ఐపీవో ఆనందం నెమ్మదిగా ఇన్వెస్టర్లలో ఆవిరి అవుతోంది. ఆ సంస్థ షేర్లు మూడు ట్రేడింగ్ సెషన్లుగా పతనాన్ని చూస్తున్నాయి. దీంతో మార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకుపైగా ఆవిరయ్యింది. భారీ రుణ సమీకరణ కోసం ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ బాండ్లను విక్రయించనున్నట్లు వార్తలు రావడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతున్నారు. సోమవారం ఒక్కరోజే కంపెనీ షేరు విలువ 16 శాతం పడిపోవడం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో నాస్‌డాక్‌లో స్పేస్ ఎక్స్ లిస్ట్ అయ్యింది. అనంతరం భారీగా పెరిగిన షేర్ ధర తాజాగా పతనం అవుతోంది.

హైదరాబాద్ మెట్రో విస్తరణ కల సాకారమయ్యే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి వరుసగా కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మెట్రో రెండో దశ విస్తరణకు, మొదటి దశ ఆస్తుల స్వాధీనంపై కేంద్రం సానుకూలంగా స్పందించింది.

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# మెట్రో ఫేజ్–2కు లైన్‌క్లియర్!

■ కేంద్ర మంత్రులతో సీఎం సమావేశం ■ సానుకూలంగా సాగిన చర్చలు ■ త్వరలోనే కీలక నివేదిక

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. అనంతరం మంగళవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన నివాసంలో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో మెట్రో సెకండ్ ఫేజ్ పనులు, ఐఆర్ఎఫ్సీ రుణం, అలాగే రాష్ట్రంలోని ఇతర కీలక ప్రాజెక్టులపై చర్చించారు. మంత్రులతో సీఎం చర్చలు సానుకూలంగా సాగాయి.

### ఎస్‌బీఐ క్యాప్స్ ఆధ్వర్యంలో నివేదిక..

మెట్రో ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మెట్రో ఫేజ్ 1 వాల్యుయేషన్, ఫేజ్ 2 విస్తరణపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎస్‌బీఐ క్యాప్స్'ను కన్సల్టెంట్‌గా నియమించారు. ఎస్‌బీఐ క్యాప్స్ ఇచ్చే నివేదిక ఆధారంగానే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని సీఎం, కేంద్రమంత్రులు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర అధికారి , రాష్ట్ర ఎంఏయూడీ ప్రత్యేక కార్యదర్శిని సమన్వయకర్తలుగా నియమించారు.

### ముఖ్య ఉద్దేశం..

మెట్రో ఫేజ్ 1 ఆస్తుల విలువను లెక్కించడం, వాటిని ప్రభుత్వం ఎలా స్వాధీనం చేసుకోవాలి? అలాగే ఐఆర్ఎఫ్సీ ద్వారా తక్కువ వడ్డీకి రుణం ఎలా పొందాలో ఈ నివేదికలో పొందుపరుస్తారు. దీని ఆధారంగా కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. కాగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన రెండో దశ మెట్రో విస్తరణ ప్లాన్‌లో దాదాపు 70 కిలోమీటర్లకు పైగా కొత్త మార్గాలు ఉండటం విశేషం.

## బ్రోకర్‌గిరి చేస్తున్న ఐఏఎస్‌లు : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని కొందరు ఐఏఎస్ అధికారులు బ్రోకర్‌గిరి చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయంలో పని చేసే అధికారులపై ఆయన విమర్శలు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంగళవారం కేటీఆర్ మాట్లాడారు. మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే కొంతమంది ఐఏఎస్ అధికారులు తమ వద్దకు వచ్చే బిల్డర్లను ఫలాన వ్యక్తిని కలవాలని చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కౌంటర్ల దగ్గర ఉండే బ్రోకర్లను కలిసి డబ్బులు కడితేనే ఐఏఎస్ అధికారులు పర్మిషన్లు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం నడుస్తలేదని, మాఫియా నడుస్తుందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి కన్ను మెట్రో భూముల మీద ఉందని కేటీఆర్ అన్నారు. మెట్రో దగ్గర రూ.30 వేల కోట్ల విలువైన 280 ఎకరాల భూములను ఆయన అన్నదమ్ములకో, బావమర్ధులకో కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.

## మంత్రుల ఇసుక దందా: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు మంత్రులు ఇసుక దందా చేస్తున్నారని ఆరోపించారు. సీతమ్మ సాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్టు ముంపు పేరుతో గోదావరి నదిని చెరబట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల మంత్రులు కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఆదివాసీల అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకొని ఇసుక క్వారీల పేరుతో గ్రామ సభలు నిర్వహించి 70 కి.మీ.ల పొడవునా గోదావరి నుంచి ఇసుక తవ్వి తీసి వేల కోట్ల రూపాయల దందాకు తెరతీశారన్నారు. ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో ఇద్దరు మంత్రులు సాగిస్తున్న ఈ దందాను అడ్డుకునే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాడుతుందని స్పష్టం చేశారు.

## కొత్త భద్రతా సవాళ్లపై అప్రమత్తంగా ఉండాలి





**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కొత్త భద్రతా సవాళ్లు, ఉగ్రవాద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ అన్నారు. 16వ బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బ్రిక్స్ విభిన్న అనుభవాలను పంచుకునే వేదిక అన్నారు. అశాంతి, మార్పుల మధ్య ఉన్న ఈ ప్రపంచంలో, సంఘర్షణ పరిష్కార యంత్రాంగాలు బలహీనపడుతున్నట్లు కనిపిస్తున్న తరుణంలో, మనకు ఒక ప్రత్యేకమైన పాత్ర ఉందని పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని భారతదేశం స్వాగతిస్తోందని దోవల్ తెలిపారు.

## బాసర ఆలయంలో చోరీ



**అక్షరటుడే, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సరస్వతి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని మహంకాళీ అమ్మవారి గుడిలో దొంగలు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి ఇద్దరు దొంగలు ఆలయంలోకి చొరబడ్డారు. మహంకాళి అమ్మవారి ఆలయ తలుపులు పగులకొట్టారు. అనంతరం అమ్మవారి వెండి కిరీటం, హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదు తీసుకొని, దానిని వ్యాసగుడి దగ్గర పడేసి పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలి : తమిళనాడు సీఎం విజయ్



**అక్షరటుడే, తమిళనాడు :** నీట్ పరీక్షను రద్దు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరోసారి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. నీట్ పరీక్ష తమిళనాడులోని వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తోందని రాష్ట్ర అసెంబ్లీలో తెలిపారు. అలాగే, విద్యార్థులపై ఏ భాషనూ రుద్దడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడు సంక్షేమానికి సంబంధించిన సమస్యలు రాజకీయ విభేదాలకు అతీతంగా ఉండాలని విజయ్ నొక్కి చెప్పారు. రాష్ట్రం కోసం కలిసి పని చేయాలన్నారు.

## అసెంబ్లీని సినిమా హాల్‌లా మార్చారు




**అక్షరటుడే, తమిళనాడు :** టీవీకే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీని సీఎం విజయ్ సినిమా హాల్‌లా మార్చారని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలను మంగళవారం డీఎంకే వాకౌట్ చేసింది. అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో కూడా విజయ్ నటించడం మొదలు పెట్టారన్నారు. విజయ్ నటిస్తుంటే స్పీకర్ కట్ చెబుతున్నారని విమర్శించారు. మళ్లీ స్పీకర్ యాక్షన్ అంటే విజయ్ నటిస్తున్నారని ఆరోపించారు. రేపటి నుంచి అసెంబ్లీకి కార్‌వాన్, మేకప్ మ్యాన్, ఫైట్ మాస్టర్లను తీసుకొస్తారేమో అని ఎద్దేవా చేశారు.

## పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం..



**అక్షరటుడే, ఏపీ:** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ కెమికల్ కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరవాడ ఫార్మాసిటీలో మంగళవారం తెల్లవారుజామున ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్ తయారీ కంపెనీ దక్షిణ్ ఎనర్జీలో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలో చిక్కుకుపోయారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు.

## సీఐ నాగరాజు అరెస్ట్



**అక్షరటుడే, ఏపీ :** సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ పోలీసులు దూకుడు పెంచారు. వజయవాడ సింగ్ నగర్‌లోని సీఐ నాగరాజు ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న ఆయన మద్దతుదారులను చెదరగొట్టి లోపలికి వెళ్లారు. అనంతరం సీఐ నాగరాజును అరెస్ట్ చేశారు. సాయికృష్ణ మేనమామ మాట్లాడుతూ.. తప్పు చేస్తే ఎవరినయినా శిక్షించవచ్చన్నారు. కానీ మనిషిని మాయం చేయడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పోలీసులపై కోపం లేదని, కానీ కానీ కృష్ణలంక పోలీసులు మనిషిని మాయం చేశారన్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.